# అరక్షణం - ఆలోచన

-చావా శివకోటి

అమావాస్య దగ్గర పడింది గనుక చిక్కగ ఉంది చీకటి.

వెలుగెట్లా? అని విచారిస్తూ కూర్చుంటే తెల్లారి పోతుంది. వెలుగూ వస్తుంది.

అయితే, ఈ చీకటిని తట్టుకొనడం ఎలా?

ఓ ప్రమిదను వెలిగిస్తే చాలు. గుడ్డి వెలుగైనా ప్రారంభమవుతుంది. మార్గం దొరుకుతది. 'పని' అనేది చేస్తూ పోవాలే తప్ప ఆగకూడుదు. ఆగకుంటే, అది ఎప్పుడూ ఎవ్వరినీ తక్కువ చేయదు. దాని నైజం కాదది.

కానీ- 'పని' చేస్తున్నట్టుగ నటించడం ఉంది చూసావూ-? అది మననే కాదు- మొత్తం సమాజాన్నే చెరుపుతుంది.

శ్రీరాములు పోలీసు యస్.ఐ.గా - నౌకరిలో చేరి ఇది అయిదో సంవత్సరం. కొత్తలో డ్రస్సు వేసుకొని పని-పని-న్యాయం-న్యాయం- అంటూ ఉరుకులూ- పరుగులతో-దాదాపు రెండేళ్ళు తలమునకలయ్యాడు. 'న్యాయానికి-న్యాయం' తన పరిధిన చేసేందుకు చాలా ఆరాటపడ్డాడు కూడా. జరగాల్సిన న్యాయం జరగకుంటే- జరపలేకపోయినపుడు బాధపడ్డ సంద ర్భాలూ అనేకం. అలాటప్పుడు పై అధికారుల పైనా, వారి మొనాటమీ ధోరణిపైనా కోపమూ- అసహనమూ కలిగేది కానీ- 'తన కోపమే తన శత్రువు' అన్నది ఈ పోలీసు డిపార్టుమెంటున- 'ఓంప్రథంగా నేర్చుకోవాలి- ' అన్న నిజాన్ని- ఆలస్యంగానైనా గుర్తెరగడంతో న్యాయం కోసం ఆర్భాటం దాదాపు చల్లబడింది. తనను తాను తమాయించుకొని బైటపడ్డ సందర్భాలూ- కళ్లముందు కదిలినయి.

అది మొదలు- మామూలు పోలీసు గాడిన నడక మొదలయింది.

ఆ వేళ హెడ్డూ- పి.సి. 422 కలిసి- అపరాత్రి అవుతుండగా ఓ జంటను పోలీసు స్టేషనుకు తీసు కొచ్చారు. అంతకు ముందే 'మయూరి' లాడ్జిపైన దాడి చేస్తే- అయిదారుగురు- ఇదే బాపతు దొరికారులా ఉంది. రైటరు వాళ్ళ వివరాలు వ్రాసుకుంటుంటే- వీర్నీ - ఆ వరసలోకి తోలారు.

'నీ పేరు?' అడిగాడు రైటరు.

'అంతమ్మ' - అంది తలదించుకొని బెరుకుగా.

'ఏ కంపెనీ నుంచి వచ్చినావు?' అడిగాడు 'అం తమ్మ - అంతమ్మట' అని వ్రాసుకుంటూ.

మాటాడలేదావిడ.

తల ఎత్తి చూశాడు.

కళ్ళు ఉబ్బి ఉన్నాయి. బాగా ఏడ్చినట్టున్నది. వంటికి పాతికేళ్ళుంటయి. బాగా బ్రతికిన దానిలా అనిపించింది. మనిషి చామన ఛాయే అయినా కళగా ఉంది మొఖం. కుదురుగ, ఒద్దికగ- కుటుంబపు మనిషిలా అనిపించింది. చీర చెంగుతో నిండా కప్పుకుని ఉన్నది.

'నేనడిగింది వినిపించలేదా?'- అడిగాడు మొఖం చిట్లించి- గొంతు పెంచి.

'నేను ఏ కంపెనీ నుంచీ రాలేదు'- అంది వెక్కుతూ.

'ఏడుపెందుకు? ఆపు-' అని. మరి లాడ్జిలో ఎందుకు?

'వారం క్రితం- మా ఊరి కుఱ్ఱాణ్ణి నమ్మి ఇక్కడ కొచ్చాను. నాల్గు రోజులుగా అతను కనిపించడంలేదు. గంటలో వస్తానని చెప్పి వెళ్లాడు. ఇక వస్తాడేమో ఇక వస్తాడేమోనని - ఎదురు చూశా. రెండు రోజులు గడిచినయి. అతని జాడ మాత్రం లేదు. ఏం చేయాలో

## పులకరింపు

"ఏమండీ! బాగున్నారా?"
మన తెలుగువాడి
ఈ పలకరింపు
విజయనగరం బొంకుల దిబ్బంత పాతది,
బెజవాడ పాపికొండలంత ప్రాచీనమైంది;
అయినా - రోజూ వచ్చి
ఒక్క రోజు కనబడకపోయినా
కలవరపరిచే ఉదయ కిరణంలా
నిత్య నూతనమైంది
అనుబంధాలను నిలిపే
ఈ పలకరింపు
నిజంగా ఒక పులకరింపే!

-ఎమ్. వి. లక్ష్మి

అర్థంగాక- ఎగతట్టిన ఏడుపును ఆపుకొనలేక- నానా ఇదీ అవుతుంటే... ఈయన- మా 'ఊరు'కు నన్ను చేరుస్తాను రమ్మనమన్నాడు.

'ఎవరతను?'

మొఖం ఎతిగిన మనిషే- మా ఊళ్ళో చాలాసార్లు కనిపించాడు. మా ఊరు మాత్రం కాదు. 'సారా' నిషేధం పెట్టినప్పటి నుంచీ- ఊళ్లోని చిల్లర కొట్టుకు- సారబెల్లం- పటిక- నవాసారం- వేస్తుండడం చూశాను. ఈయనతో లోగడ ఎన్నడూ మాటాడి ఎరుగను కానీ- ఇతను తెల్సు. ఇతని పేరు 'మూర్తి' ఏ 'మూర్తో' తెలీదు. అలా అని విన్నాను.. అయితే- మా ఊళ్ళో- నేను లేచిపోయినట్టుగా అనుకొనడం లేదనీ- మా పెద్దమ్మ ఇంటికి వెళ్లాననీ- ఊరి వార్త నాకు చెప్పాడు. నాల్గు చివాట్లు తిన్నా, దెబ్బలు తిన్నా ఇంటికే వెళ్ళడం మంచిదనిపించింది. అంతే- వెంటనే బయలుదేరాం. అయితే మా 'ఊరు'కు వెళ్తే చివరి బస్సు వెళ్ళిపోవడాన- ఈ రాత్రి తలదాచుకునేందుకు మయూరి లాడ్జికి చేరాం. అంతకు మించి ఆయనకూ నాకూ ఏ సంబంధమూ లేదు' అంది కళ్ళు తుడుచుకుని, ముక్కు చీదుతూ.

## ముష్టివాడి ఆలాపన

చెడ్డోడు నా పేరు / నా చరిత్ర హీనం
మసిగుడ్డల ఒంటిమీద / మట్టి దిబ్బల్లో రాత్రంతా-
    చెత్త కుండీల పద్ద విస్తరాకు
    కుక్కలకు పరమాన్నమైనా
    ఆఖరి మెతుకులు నాకు
    ఆకలిని గుచ్చే ముండ్లు
పగిలిన చిప్పలోన / ఈగల హోరు
సొట్టబోయిన గ్లాసులో నీళ్ళు
మురికి కడుపులో పన్నీరు
    గుడిమెట్ల దగ్గరి చిల్లరనాణెం
    చిరిగిన జేబులో దాగదు
    అరటి ఆకులో భోజనానికి
    అర్థరూపాయిలు ఆగవు!
ఛీత్కారాలు హేళనలు
గుండెనిండా పుట్టెడు దుఃఖం
మాసిపోయిన గెడ్డం చూసి
మొరిగే కుక్కలే నా నేస్తాలు.

**-మండాది గోపీనాథ్**

'నిజమే కావచ్చు' అనిపించింది రైటరుకూ. ఆవిడ తీరు చూశాక- రొటీన్‌గా వచ్చే వ్యభిచారిణుల లక్షణాలు బొత్తిగా కనిపించలేదు.

'మూర్తి ఎవరు?' అని పెద్దగా పిలిచాడు. మళ్ళీ- అతనితోనే మాటాడుదామని-

'నేనే సార్!' అంటూ వచ్చాడు. కొంచెం బెదురుగా చూస్తూ-

'ఏభై ఏళ్ళుంటాయి. మెడ దగ్గర ముడతలూ కనబడుతున్నాయి. జుత్తు సగం రాలిపోయింది. కాకపోతే ఉన్న జుత్తుకూ- మీసాలకూ 'రంగు' వేసుకున్నాడు- మొఖం చూడగానే- ఫలానా టైపు- అని మాత్రం అర్థంగాలేదు. మొఖాన ఏ భావనా పలకడంలేదు. చందమామలా గుండ్రటి మొఖం.

'ఈవిడెవరు? నీతో ఎందుకుంది?' అడిగాడు పోలీసు ధోరణిన.

'నేను 'పాటిం' వ్యాపార నిమిత్తం నెలకు నాల్గయిదు సార్లు వెళ్తుంటాను సార్. అక్కడ ఈవిడను చూశాను. ఎన్నడూ మాటాడలేదు. ఆ అవసరమూ రాలేదు. తోవన ఎదురుపడినపుడు చూసిన గుర్తు. అయితే, ఇక్కడ మోసపోయి కనిపించింది. భయపడుతున్నాం. ఇక్కడ వదిలేస్తే- మరీ చిక్కుల్లో పడతారని వాళ్ళ ఊరుకు చేరుద్దామనుకున్నాను. చెప్పాను. 'సరే'నన్నది. చివరి బస్సు వెళ్లిపోవడంతో బస్సుస్టాండున తెల్లవార్లుండడం కుదరదని- ఇక్కడకొచ్చాము. మమ్మల్ని ఇలా పట్టు కొచ్చారు' అన్నాడు.

'నువ్వు చేసే వ్యాపారమేంటి?' అడిగాడు.

నాల్గయిదు ఊళ్ళలో ఉన్న కిరాణా దుకాణాలకు పచారు సరుకులు వేస్తుంటాను. వారం వారం వెళ్ళి.. బాకీ పద్దులు వసూలు చేసుకుంటుంటాను. అప్పుడు వాళ్ళు చెప్పిన వస్తువుల్ని వ్రాసుకొని మరో వారం వచ్చినపుడు తెచ్చిస్తుంటాను' అంటుండగా హెడ్డు- స్టేషను బయట నుంచి లోనకొచ్చి- రైటరు వేపు చూశాడు. అప్పుడు ఇతను కనిపించడంతో, 'ఏం రామ్మూర్తీ! ఇక్కడున్నవేరా? ఏమైంది?' అని దగ్గరకొస్తూ పలకరించాడు.

'ఈయన మీకు తెల్సునా? యస్.ఐ.గారు లాడ్జి నుంచి పట్టుకొచ్చిండు' అన్నాడు రైటరు.

'అట్టెట్ట?' అన్నాడు- ఆగి.

జరిగింది చెప్పిండు రైటరు- మూర్తేపు చూసిండు. తలూపిండు.

'ఈ మూర్తి గారు సారా మామ్లా నుంచి ఎఱుక.

అడ్డగోలు ఆగం మనిషిగాడు. ఖదరున్నోడు. పెద్దసార కంపెనీల రైడ్ ఇన్‌చార్జిగ చేసిండు. ఆ నాలుగేళ్ళు మనోళ్లను మంచిగ చూసుకున్నాడు. రాజకీయపు రంకాటన, సార మామ్లాలు సంకనాకినయిగదా! ఈయన సీటుగాదుగద! గందుకే బతుకు తెరువుకు– ఈ యాపారంల బడ్డట్టుంది. ఈయన్ను పక్కనుంచు– యస్.ఐ. సాబ్ వచ్చినంక నేను సంజాయించి చెప్తలే' అని మూర్తి వైపు తిరిగి– బేఫికరుగ ఉండు. నేను చెప్తగద!' అని బయటకు నడిచిండు. నడుస్తూ 'చాయ్ గిట్ల తాగుతవా?' అన్నాడు.

'చేసిన మేలు చాలు. చాయ్ ఇప్పుడు తాగను' అన్నాడు నమస్కరిస్తూ మూర్తి.

'వస్తే' అంటూ మెట్లు దిగిండు.

'ఇక మీరు బయట చెట్టు కిందికి పోండ్రి' అన్నాడు రైటరు మూర్తినీ– అంతమ్మనూ.

'నెక్స్ట్' అన్నాడు పి.సి. 112ను చూస్తూ.

ఒకావిడ దగ్గరికొచ్చింది. హెడ్డు గారు తోలుకొచ్చినావిడ.

'నీ పేరు?' అడిగిండు రైటరు– వ్రాత మొద లెడుతూ.

'శ్రీమతి' అన్నది– నెమ్మదిగా. గొంతు జీరపోయి ఉన్నది.

కిసుక్కున నవ్వి– 'నిన్ను శ్రీమతి కాదని ఎవరన్నారు– దానెంట ఏదో ఒక పేరుంటది గదా!' అన్నాడు రైటరు.

'నా పేరు అది' అన్నది– ఇంకా నెమ్మదిగా.

'అరె! కూస్త పెద్దగా చెప్తె నీ సొమ్మేంపోతాది–' అంటూ ఆవిడ వైపు చూసిండు.

వ్రాస్తున్న కలం ఆగిపోయింది– ఎట్టనో అయిండు. గబుక్కున కూర్చున చోటు నుంచి లేచి

'అరె! ఏంది బిడ్డా! నువ్వు మా పక్కనున్న పేష్కారి 'పోరివి'గాదు! ఈ పొద్దు నీకు పెండ్లిచూపులంటిరిగద! ఇదేంది?' అన్నాడు పరేషనయి.

'పెళ్లి చూపులయ్యినంక– పెళ్లి పోరడు నాతో ఒంటరిగ మాట్లాడ్తనన్నడు. అయ్య వప్పుకున్నాడు. ఈయనేమో బయటకని తీసుకొచ్చి లాడ్జిల పెట్టిండు. మా మాట ముచ్చట– గాకముందే, పోలుసులు పట్టు కొని ఇట్ట తోలుకొచ్చినారు– ఆయన చెప్పెడెది వినిపిం చుకోలే. పైగా– ఆవిడే దెబ్బలు కొట్టిస్తు' అన్నది కళ్లు తుడుచుకుంటూ.

'ఎవరు? ఎవరు?' వాళ్లను తోలుకొచ్చింది?' అన్నాడు పెద్దగా– కోపంగా పోలీసు పద్ధతిన.

## స్ఫూర్తి

కనువిందు చేసే ప్రకృతి / కణ కణంలో నుండి
కదలిపోయే కాలం / క్షణక్షణంలో నుండి
అందాల్ని పిండుకో నేస్తం!
ఆనందాల్ని పంచుకో నేస్తం!
శిశిరంలో ఆకుల కన్నీళ్లను
టప టపా రాల్చే 'భుజా'లకూ
తరుణంలో అలసత్వాన్ని / కుబుసంగా విడిచి
సరిక్రొత్త జవసత్త్వాల్ని సమకూర్చుకొని
సాగిపోయే 'భుజంగాల'కూ
తరలిపోయిన వసంతం
జారిపోయిన యౌవనం
మళ్ళీ మళ్ళీ స్వాగతించి–
తరువును– నవ పల్లవ పులకితంగా
తనువును– నిత్య నూతన పరిపుల్లంగా
సంతరించడం–
జగమెఱిగిన సృష్టి వైచిత్రి కావచ్చు! / కాని–
మహోన్నత మానవ జీవితంలో
మరలిపోయిన తరుణ యౌవనం
తిరిగిరాదెన్నడనీ–
కదలిపోయిన కాలం పాదముద్రలు
చెదరి పోవెన్నడనీ–
అనుభవైక్య వేద్యంగానే నీకు తెలిసేది!!
ప్రతివత్సరానికోమారు
ప్రకృతిలో యిగిరిపోయి ఎగిరిపోయే
పచ్చదనాన్ని–
నిత్య నూతనంగా నిలువెల్లా పొదిగి
సతత హరితంగా సింగారించే 'శక్తి'
'పరమాత్మ'దైతే
శరీరం వృద్ధమై వడలిపోతున్నా
మనసుకు వార్ధక్య మలినమంటకుండా
నిరత యౌవనాన్ని నిరూపించుకునే శక్తి
నీ ఆత్మకూ ఉంది!
అందుకే–
ప్రకృతి ప్రభావంతో 'పరిగై' పోయే
'వికృతి'వి కాకు!!
నీ 'ఆత్మశక్తి'తో భౌతిక ప్రపంచాన్ని
శాసించే 'ప్రకృతి'వి కా!!

–బొందిడి పురుషోత్తమరావు

యస్.ఐ. అప్పుడే స్టేషను మెట్లెక్కుతూ- రైటరు అరవడం విని- అటుగ నడచి- 'ఏం? పతివ్రతల నేరుతున్నవా?' అన్నాడు- అరకొరగ నవ్వుతూ.

'కాదు సార్! ఈ 'పోరి' మా ఇంటి ప్రక్కనున్న-' అంటుండగనే- ఫోను మోగింది. ఎత్తి- అది విని- చకచక 204 అంటూ- మెట్లు దిగిండు. జీపెక్కేటప్పుడు మాత్రం- కాగితాలు పూర్తిచెయ్యి- పొద్దుట వాళ్లనం దరిని కోర్టుకంపాలె' అని అని వెళ్ళిపోయాడు.

'ఎస్ సర్' అన్నాడు రైటరు ఓ సెల్యూట్ కొట్టి-

సీటులో కూర్చుని- యస్.ఐ. ఆర్డరు పకారం- వాళ్లనూ కాగితాల్లోకెక్కించిండు. పొద్దుటే యస్.ఐ. రాంగనే చెప్పి- వాళ్ళను మాత్రం బయటకు తోలాల అనుకున్నాడు. 'నేను చూసుకుంటలే' అని అనిపించింది. బిడ్డను చూస్తే గోస అనిపించి ఆ రాత్రి స్టేషన్ల లేకుండా చేసిండు.

'నెక్ట్' అన్నాడు పెద్దగ- మనసంత ఎట్లగో అయింది.

ఎదురుగ వచ్చినావిడను- కనీసం చూడక 'పేరు' అన్నాడు.

'అనసూయ' అంది.

అంత బాధలోనూ నవ్వొచ్చింది. త్రిమూర్తులను పసిపాపలుగ చేసిన సాధ్వి పేరిది- స్టేషన్ల వినపడతన్నది అనిపించింది. ఒక్కసారి తలెత్తిండు. 'అమ్మో! ఇది పక్కా అదే' అనుకుని 'ఏ కంపెనీ' అనడిగాడు.

'రంగా జిమ్మీ కంపెనీ' అంది గర్వంగా.

ఉలిక్కిపడ్డాడు రైటరు. రంగా జిమ్మీ అంటేనే- ఎ.ఎస్.పి.గారి స్వంత ఇలాఖా. నేనీడ ఉన్నంత వరకూ- రంగా జిమ్మీ పైన కాకీ నీడ పడకూడదని ఒకసారి చెప్పగా విన్నది గుర్తుకొచ్చింది. ఛ-ఛ- అసలేంటియ్యాళ. 'కలం- కూసింత నడవదాయె' అనుకొని- 'నువ్వు పోవే' అని కసిరి-

'నెక్స్ట్'-

వస్తూనే- ఆవిడ 'రజియా'ను అంది.

'ఏం పేర్లు పెడతారురా బాబూ! వీళ్లేమో ఇట్టా తయారౌతారు'- అని సణుగుకొని "మనది 'ఏ కంపెనీ' అన్నాడు.

ఈ మాటకు మెలికలు తిరిగిపోతూ పెద్దగ నవ్వింది రజియా. దాని నవ్వు పొడుగాను- వ్రాద్దామనుకున్న కాగితం నిండా నములుతున్న ఖారా కిల్లీ తుంపర్లు పడినయి.

'ఒళ్లేమన్నా తిక్కగుందా? లాఠీ కావాల్నా ఛుప్, నోర్ముయ్' అని అరచిండు.

'మనదే కంపెనీ' అనడిగితే- నవ్వాగలేదు. దీని కేందో అయితలే' అంది వెనక్కి జరిగి.

రైటరు కాగితాలు మార్చుకుంటుండగానే దగ్గరకు నడిచి 'నేనెవరినో తెల్సునా?' అన్నది.

'లంజతనం చేస్తూ దొరికినదానివి. ఎవరివైతే నాకేం' అనుకుని- 'చెప్పు' అన్నట్టుగా చూసిండు

'ఐ.డి. పార్టీ సి.ఐ. ఫ్రెడ్రిక్ గారి తాలూకు. నువ్వు ఫోను చేసుకొని తెల్సుకో- నే పోతా' అని చాలా నిర్లక్ష్యంగా నడిచింది.

ఆగమంటే సి.ఐ. ఫ్రెడ్రిక్‌కు ఏం కోపమో? వద్దంటే యస్.ఐ. ఏమంటడో- అనుకొని- 'అమ్మా' అన్నాడు సీటునుంచి లేచి.

ఆగింది రజియా.

తమరు ఫ్రెడ్రిక్ సి.ఐ. గార్కి ఫోనుజేసి- మా యస్.ఐ. గారికోమాట చెప్పించు- లేకుంటే- కుదర్దు' అన్నాడు బలవంతాన.

'నే చెయ్యను' అంది రజియా. ఎదురుగ ఉన్న బల్లపైన బైఠాయించింది. 'ఈడే ఉంటా' అన్నట్టు.

'ఓర్నాయనో, ఇదేం ఉద్యోగం. పోలీసోడి ముండయినంత మాత్రాన ఇంత 'గోరోజన'మా? అనుకుని తల పట్టుకొని సీటున చతికిల పడ్డాడు రైటరు.

○ ○ ○

ఆ మర్నాటి రాత్రి- ట్యాంక్ బండున ఓ 'శవం' కనిపించింది- తీసారు.

పేప్కారు- 'పోర'ది- కుటుంబమంత ఆడికి చేరి గుండెలవిసేలాగ ఏడ్చినారు.

కోర్టున జరిమానా కట్టినంక 'పోరడు' అటునుంచటే- ఎటో పోయిండట. వాడు వాళ్లింటికి చేరిన జాడలేదు. ఈ 'పోరే'మో- ఇంటికొచ్చి ఈ పని చేసింది. 'ఇజ్జత్'లో బతికెటోళ్లు.. గిట్ల అయినాక- బతకరు గద.

రైటరూ- వాళ్లతో సివిల్ డ్రస్సులో వచ్చి- ఏడుస్తా కూర్చున్నాడు- తన స్థితికి తానే సిగ్గుపడ్తూ.

స్టేషను హెడ్డు- అనెటోడు ఒక్క అరక్షణం- మనిషిని చూసి మనస్సు పెట్టి ఆలోచిస్తే- నిజమూ అర్థమయ్యేది. ఇట్టా జరిగేదే కాదు గదా- అనుకున్నాడు.

○ ○ ○

డ్యూటీన ఉండి- డ్యూటీ చేస్తున్నట్టుగ ఉండడం- డ్యూటీ నిర్వహణ- అనరు.

అది- సమాజంపైన పడి- తన పని తాను చేసుకు పోతుంది. ■